andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 । కనిష్ఠం 17.8



నిర్మల్
జిల్లా వార్తలు
8
గురువారం 16 జనవరి 2025

పల్లె దారులకు మహర్దశ



- స్టేట్ రోడ్స్ ప్రాజెక్టు కింద 400 గ్రామ పంచాయతీల ఎంపిక
- మండల కేంద్రాల నుంచి ఫోర్‌లేన్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- జిల్లాలోని మారుమూల పల్లె రోడ్లకు మహర్దశ

నిర్మల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మారుమూల రోడ్ల నిర్మాణానికి మహర్దశ పట్టబోతోంది. స్టేట్ రోడ్ ప్రాజెక్టు ప్రోగ్రాం కింద జిల్లాలోని 400 గ్రామ పంచాయతీలను ఈ ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు. స్టేట్‌రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టబోతున్న ఈ రోడ్ల నిర్మాణ పనులను అటు పంచాయతీరాజ్ శాఖ ఇటు ఆర్ అండ్ బీ శాఖలు పర్యవేక్షించనున్నాయి. మారుమూల పల్లెలకు ఇక తప్పనిసరిగా రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దశాబ్దాల కాలం నుంచి నిర్మల్ జిల్లాలోని పలు మారుమూల గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యాలు లేని కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షకాలంలో ఈ పల్లెల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. వర్షాల కారణంగా వరదలకు కనెక్టివిటీ కూడా నిలిచిపోయింది. అయితే ప్రభుత్వం ఈ పల్లెలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సుదీర్ఘ కాలం నుంచి కోరుతున్నప్పటికీ పెద్దగా ఫలితం కనిపించడం లేదు. అయితే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్టేట్ రోడ్స్ ప్రాజెక్టు ప్రోగ్రాం కింద జిల్లాలోని మూడు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మండలకేంద్రాల వరకు రోడ్డు మార్గాన్ని నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేయడమే కాకుండా స్థానికులు కూడా కోరారు. అయితే ఇటు ప్రజల నుంచి అటు ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో ప్రభుత్వం జిల్లాలోని పలు గ్రామాలను స్టేట్‌రోడ్స్ ప్రాజెక్టు ప్రోగ్రాం కింద ఎంపిక చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యేక ప్యాకేజీని కూడా రూపొందించారు. అయితే ప్రస్తుతం రాబోయే మూడేళ్లకు సరిపోయే విధంగా ప్రణాళిక ప్రతిపాదనలు రూపొందించారు. దీనికి అనుగుణంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖలు మారుమూల రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాయి. బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న అనేక గ్రామ పంచాయతీలకు రోడ్డు సౌకర్యం లేని కారణంగా గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీఏటా వర్షాకాలంలో ప్రజలు బాహ్య ప్రపంచానికి దూరంగా గడుపుతున్నారు. రోడ్డుసౌకర్యం లేని కారణంగా జనం తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు. వాగులు, వంకలు, సెలయేర్లు దాటేందుకు వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని 400 గ్రామ పంచాయతీలకు రోడ్ల అభివృద్ధి ప్రాజెక్టు పరిధిలోకి చేర్చింది. ఈ విధంగా జిల్లాలోని దాదాపు 18 మండలాలకు పైగా ప్రజలు సురక్షితమైన రోడ్ల సమస్యను అధిగమించేందుకు కోసం సిద్ధమవుతున్నారు. మొత్తానికి కేంద్రప్రభుత్వం తన నిధులతో రోడ్ల అభివృద్ధికి చేపట్టబోతున్న కార్యక్రమం ఇక్కడి పల్లె ప్రజలకు వరం కాబోతోంది.

స్టేట్ రోడ్స్ ప్రాజెక్టు ప్రోగ్రాం కింద పలు పల్లెలు

కాగా జిల్లాలోని అనేక మారుమూల గ్రామాలకు ఇప్పటి వరకు కనీసస్థాయిలో రోడ్డుసౌకర్యం లేకపోవడం ఇక్కడి ప్రజలకు శాపంగా మారుతోంది. ఇప్పటికే చాలా మారుమూల గ్రామాల ప్రజలు తమకు రోడ్డుసౌకర్యం కల్పించాలని కోరుతూ ప్రభుత్వానికి వినతులు సమర్పించారు. అయినప్పటికీ ప్రభుత్వం నిధుల కొరతతో పాటు క్షేత్రస్థాయిలోని పరిస్థితుల కారణంగా అటు వైపు దృష్టి కేంద్రీకరించలేదు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి అధికారులు సరియైన ప్రతిపాదనలు రూపొందించి సర్కారుకు నివేదించగా ప్రభుత్వం ఆ ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ జారీ చేసింది. దీంతో కొద్ది రోజుల్లోనే మారుమూల పల్లెలకు రోడ్డు సౌకర్యం దక్కబోతోందంటున్నారు.

రవాణా, వాణిజ్య పరమైన అభివృద్ధి

ఇదిలా ఉండగా ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త రోడ్ల నిర్మాణం కారణంగా అభివృద్ధి పంజుకునే అవకాశాలున్నాయంటున్నారు. రవాణా రంగం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందబోతున్న కారణంగా రవాణా రంగం పురోగమించబోతోందని అంటున్నారు. ఇప్పటి వరకు కాలినడకనే శరణ్యంగా భావిస్తున్న మారుమూల పల్లె ప్రజలు ఇక రోడ్ల అభివృద్ధితో తమ తలరాతలు మారబోతున్నాయని అంటున్నారు. ప్రజలు రవాణా రంగం అభివృద్ధి చెందే అవకాశాలు ఉండడంతో ఇక జన సంచారం పెరిగి వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకోనున్నాయని అంటున్నారు. రోడ్ల కారణంగా ప్రజల ఇబ్బందులు తొలగిపోనున్నాయని అంటున్నారు. కేంద్రప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా మారుమూల పల్లె ప్రజల అభివృద్ధి మరింత సులభం కాబోతోందని అంటున్నారు.

పంచాయతీ రాజ్ కార్యాలయం ఇదే



జిల్లా కలెక్టర్ కార్యాలయం ఇదే



రోడ్లు భవనాల శాఖ జిల్లా కార్యాలయం ఇదే



ప్యాకేజీ కింద 400ల గ్రామ పంచాయతీలను ఎంపిక చేశాం

- శంకరయ్య, ఈఈ, పంచాయతీ రాజ్ శాఖ, నిర్మల్



జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరయ్యను సంప్రదించగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న స్టేట్ హైవే ప్రాజెక్టులో భాగంగా రోడ్లను అభివృద్ధి చేపట్టేందుకు 400ల గ్రామ పంచాయతీలను ఎంపిక చేశామని తెలిపారు. గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రానికి పటిష్టమైన నాణ్యమైన రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి నాలుగు లైన్ల రోడ్డు ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం కోసం ఒక కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పజెప్పినట్లు తెలిపారు. సదరు కన్సల్టెన్సీ సంబంధించిన బృందం జిల్లాలో పర్యటించి డీపీఆర్ సిద్ధం చేయనున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లాలను ఒక ప్యాకేజీగా గుర్తించి నిధులను మంజూరు చేయడంలో ఆయన వివరించారు.

సమస్యలు పరిష్కరించమని కోరిన సెంట్రింగ్ కార్మికులు



డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుతో జిల్లా సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్

నిర్మల్ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాందేడపు చిన్ను, అడపా శ్రీకాంత్, కొంతం గణేష్, ఒల్లెపు శివ భూపతి, షకీల్, రియాస్ షరీఫ్, షేక్ రషీద్, ఎల్లయ్య, భోజన్న, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ

నిర్మల్ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని వేరువేరుగా డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ... తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపాలని, పెండింగ్ బిల్లుల సమస్యలు పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తోట నరేంద్ర బాబు, కొబ్బాయి శంకర్, బి. గజ్జారం, కుంట సాయి కుమార్, సగ్గం స్వామి, చింత మోహన్, పి.సాయి ప్రసాద్, రాజన్న, కృష్ణ కిషోర్, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి

వాహనాలు నడపరాదు



కుంటాల, జనవరి, 15 : (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సీఐ నైలు అన్నారు. బుధవారం సాయంత్రం భైంసా- నిర్మల్ జాతీయ రహదారిపై అర్లి ఎక్స్ రోడ్డు వద్ద ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై భాస్కరా చారి, ఏఎస్ఐ జీవన్ రావు, కుంటాల పోలీసులు పాల్గొని నిర్వహించిన తనిఖీల్లో వాహన చోదకులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు హెల్మెంట్ తప్పక ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు సీటు బెల్టు ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని అన్నారు.

ఉరి వేసుకొని ఒకరి బలవన్మరణం



సోన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంజాల్ గ్రామంలో కూలీ పని చేస్తున్న బిలుక్ నందు మంగళవారం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే బిలుక్ నందు నిర్మల్‌లోని వైఎస్ఆర్ కాలనీలో నివాసముండేవాడని, కూలీ పని నిమి త్తం గంజాల్ గ్రామానికి వచ్చాడని గ్రా మస్థులు తెలిపారు. వైఎస్ఆర్ కాలనీలో జరిగిన గొడవలో ఒక మహిళ మృతు డిని పంచాయతీకి పిలిపిస్తానని, ఇంకా ఏ ఇతర కారణాలచేతనో బిలుక్ నందు తన ఇంటి పక్కన ఉన్న టేకు చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయాడు. ఈ మేరకు సోన్ ఎస్సై కే. గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాలిపటం ఎగురవేస్తూ

మేడపై నుంచి పడి బాలుడి మృతి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని పరిశీలిస్తున్న పోలీసులు

నిర్మల్ అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గుల్జార్ మార్కెట్‌కు చెందిన హంజైఫ్(10) అనే బాలుడు బుధవారం గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదశాత్తు మేడపై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలపాలు అయ్యాడు. స్థానికులు 108కి సమాచారం అందజేయడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు ఆసుపత్రిలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎంఐఎం నేత మాజీ కౌన్సిలర్ రఫీ అహ్మద్ ఖురేషి పోలీసులకు ఘటన వివరాలు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

చెరువులో మృతశిశువు లభ్యం

సారంగాపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జామ్ గ్రామ సమీపంలో గల కోమటి చెరువులో మంగళవారం గర్భాశయ మృత శిశువు లభ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెరువులో పడి ఉన్న సుమారు 6 నెలల గర్భాశయ ఆడశిశువు మృత పిండాన్ని గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామ, వార్డు సభల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి ఈ నెల 22వ తేదీ వరకు అర్హుల గుర్తింపు ప్రక్రియను పూర్తిచేసి, పంచాయతీలలో గ్రామసభలను, పట్టణాల్లో వార్డు సభలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి పై పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ జూమ్ మీటింగ్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం పట్టా పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లను కలుపుకొని ప్రతీఏటా ఎకరానికి రూ. 12,000ల చొప్పున నేరుగా వారి ఖాతాలలో నగదు జమ చేయనుందని తెలిపారు. భూ భారతి(ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా రైతు భరోసా పథకం కింద అర్హులైన వారిని గుర్తించాలని సూచించారు. సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు 12 వేల రూపాయలు అందించేందుకు ఉద్దేశించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించాలన్నారు. పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు అర్హుల గుర్తింపు ప్రక్రియను పూర్తిచేసి, గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో అర్హులకు పథకాలు అందేందుకై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ, పౌర సరఫరాల అధికారులు, ఏపీఎంలు, అధికారులచే సమన్వయ బృందాలను ఏర్పాటు చేయడమైందని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందేలా లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించాలన్నారు. కొత్త ఆహార భద్రత (రేషన్) కార్డులు జారీకై క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి తలసరి ఆదాయం, భూమి కలిగి ఉన్న కుటుంబాలకు కొత్తరేషన్ కార్డులను అందించడమే కాకుండా, పాత కార్డులలో మార్పులు చేర్పులను సైతం చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి కూడా ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి లబ్ధి చేకూరేలా చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో సందేహాలు ఉన్నట్లయితే మండల స్థాయిలో తహసీల్దార్‌లను, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి

- ఎస్పీ డా. జానకీ షర్మిల



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ డా. జానకీ షర్మిల, పక్కన ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసా, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోర్టుల పరిధిలలో పెండింగ్‌లోనున్న కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మిల సూచించారు. బుధవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజావాణిని నిర్వహించిన సందర్భంగా డివిజన్ పరిధిలోని కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రాసిక్యూషన్ అధికారుల సహాయ, సహకారాలు తీసుకొని కేసులకు సంబంధించిన ఖచ్చితమైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి దోషులకు శిక్ష పడేలా చూడాలన్నారు. పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలను విశదీకరించారు. పెండింగ్ కేసులకు సంబంధించి చార్జ్‌షీట్‌లను త్వరితగతినకోర్టుకు నివేదించాలని వెల్లడించారు. కేసుల విచారణ సత్వరంగా చేపట్టేందుకు గాను అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాసిక్యూషన్ అధికారుల, సూచనలను పాటిస్తూ దోషులెవరు శిక్షల నుంచి తప్పించుకోకుండా చూడాలన్నారు. అంతకు ముందు ప్రజావాణిలో భాగంగా ఎస్పీ డా. జానకీ షర్మిల అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నేరుగా దరఖాస్తులు స్వీకరించి అర్జీదారులు తెలిపిన సమస్యలను విన్నారు. సంబంధిత అర్జీలను ఆయా పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలకు వివరించి చట్ట ప్రకారం వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసు శాఖ సేవలు మరింత చేరువగా తీసుకవచ్చే ప్రక్రియల్లో భాగంగానే ప్రతి బుధవారం భైంసాలో క్యాంపు కార్యాలయంలో ప్రజావాణిని నిర్వహిస్తున్నట్లుగా వెల్లడించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇందులో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, భైంసా టౌన్, రూరల్ సీఐలు గోపినాథ్, నైలులతో పాటు డివిజన్ పరిధిలోని ఆయా పోలీసు స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

జంబి చెట్టుని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

- ఖానాపూర్ పోలీసులకు హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

ఖానాపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఏళ్ల తరబడి దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్న శమీ పూజస్థలంలో జంబిచెట్టును (శమీవృక్షము) ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన పలు హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఖానాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఏళ్ల తరబడిగా శమీపూజ స్థలంలో పవిత్రమైన జంబిచెట్టు (శమీవృక్షము)ను పెంచుతున్నామని అటువంటి స్థలంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తు పవిత్రమైన శమీవృక్షాన్ని ధ్వంసం చేసి మా మనోభావాలను దెబ్బతీశారన్నారు. వెంటనే ఈ ఘటనకు పాల్పడిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు అంశాలతో కూడిన ఫిర్యాదు కాపీని ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ యూత్ అధ్యక్షులు పరాంకుశం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కొండాడి గంగారావు, స్థానిక కౌన్సిలర్ కుర్మ శ్రీనివాస్, పడాల ప్రభాకర్, బీసీ రమేష్, ఏనుగుల రాజేశ్వర్, మహాజన్ జితేందర్ గుప్తా, కొట మహేష్, చింతామణి శ్రీనివాసకృష్ణ స్వామి, కొండాసురేష్, సంద రాకేష్, తనుగుల రమేష్, తుమ్మనపల్లి సాంకేత్ వర్ధన్, తదితరులున్నారు.

యాత్రికుల బస్సుకు అగ్ని ప్రమాదం

- ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బృందావన్‌లో ఘటన
- కుభీర్ మండలంలోని పల్సి యాత్రికుడి సజీవ దహనం
- యాత్రికులను సురక్షితంగా భైంసా రప్పించేందుకు చర్యలు



శీలం దురుపతి(ఫైల్), కాలిపోతున్న యాత్రికుల బస్సు

కుభీర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : భైంసా డివిజన్ నుంచి ఈ నెల 1వ తేదీన తీర్థయాత్రలకు బయలుదేరి తిరిగి వస్తున్న యాత్రికుల బస్సు మంగళవారం అగ్ని ప్రమాదానికి గురయ్యింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బృందావన్ క్షేత్రంలో సాయంత్రం 5గంటలకు ఈ ఘటన జరిగినట్లు సమాచారం. కుభీర్ మండలంలోని పల్సి గ్రామానికి చెందిన శీలం దురుపతి(69) అనే వృద్ధుడు సజీవ దహనమైనట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ ప్రమాదంలో యాత్రికుల బట్టలు, సామాగ్రి దగ్ధమయ్యాయి. బృందావన్‌కు చేరుకున్న యాత్రికుల బస్సు సాయంత్రం 5గంటలకు చేరుకుంది. ఇందులో 50 మంది యాత్రికులలో అందరు బృందావన్ క్షేత్ర దర్శనానికి వెళ్లారు. ఇందులో పల్సి గ్రామానికి చెందిన వృద్ధుడు అనారోగ్యం కారణంగా బస్సులోనే పడుకున్నాడు. ఇదే సమయంలో బస్సు అగ్ని ప్రమాదానికి గురయింది. అందులో ఉన్న వృద్ధుడు సజీవదహనం అయ్యాడు. అందులో ఉన్న మిగతా యాత్రీకుల బట్టలు సామాగ్రి కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలిన యాత్రికులకు బృందావన్ పోలీసు అధికారులు, ఆర్ఎస్ఎస్ నాయకులు సంరక్షణ కల్పించారు. కప్పుకునేందుకు దుప్పట్లు, ధరించుకునేందుకు దుస్తులతో పాటు ఇతర సామాగ్రిని ఉచితంగా అందజేశారు. యాత్రికులను సురక్షితంగా భైంసా రప్పించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్, ముధోల్ ఎమ్మెల్యే రామరావుపాటిల్ చొరవ చూపి అక్కడి జిల్లా కలెక్టరు, ఎస్పీతో మాట్లాడారు. యాత్రికులను సురక్షితంగా తరలించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో యాత్రీకులకు ఒక్కొక్కరికి రూ. 1000, వాటర్ బాటిళ్లు, తినుబండారాలను అందించి యాత్రికులను స్వస్థలాలకు తరలించేందుకు రెండు బస్సులను ఏర్పాటు చేసి బుధవారం అక్కడి నుంచి పంపించారు. చొరవ చూపిన కేంద్రమంత్రి బండి సంజయ్, ముధోల్ ఎమ్మెల్యే రామరావుపాటిల్‌లకు యాత్రీకుల కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

బృందావన్‌లోనే అంత్యక్రియలు

బస్సు అగ్ని ప్రమాదానికి గురయి అందులో సజీవ దహనమైన శీలం దురుపతి(69) అనే వృద్ధుడి మృతదేహాన్ని అక్కడి సంబంధిత అధికారులు శవ పరీక్ష నిర్వహించి బృందావన్‌లోనే బుధవారం వేకువ జామున 4గంటలకు అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబీకులు తెలిపారు. తీర్థయాత్రలు పూర్తి చేసుకొని తిరిగి వస్తుండగా అందులోని యాత్రికులు బృందావన్‌లోని దేవాలయ దర్శనానికి వెల్లగ తనకు జ్వరం వచ్చిందని దర్శనానికి వెల్లకుండా బస్సులోనే నిద్రిస్తున్న సమయంలో బస్సు అగ్ని ప్రమాదానికి గురయి సజీవ దహనమైనట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
నిర్మల్ - 99854 03060
భైంసా - 81258 56776
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451


ఇస్లాంపూరలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

ఇచ్చోడ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మదర్సా దారులుమ్ ప్రహరీ నిర్మాణానికి రూ.10లక్షలు, ఇస్లాంపూర కాలనీలో రూ.15 లక్షల నిధులతో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చోడ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రస్తుతం గ్రావెల్ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని త్వరలోనే సీసీ రోడ్లతో పాటు మురుగు కాలువలు నిర్మించి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు షాబీర్, సుభాష్, పాండు, రమేష్, విజయ్, మహేందర్‌రెడ్డి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

● ప్రతీ గ్రామానికి విద్య, వైద్యం అందేలా కృషి

నేరడిగొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గల ప్రతీ గ్రామానికి విద్య, వైద్యం అందెలా కృషి చెస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని రెంగన్‌వాడి, బొందిడి గ్రామాలలో పర్యటించారు. రెంగన్‌వాడి గ్రామాని వెళ్లే రహదారిపై వంతెన లేక వర్షాకాలంలో గ్రామస్థులు ఇబ్బంది పడటాన్ని గమనించి రూ.9లక్షల 20వేలతో వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీప రాథోడ్ సజన్, కైలాస్, సురెందర్ అభిరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేసే పథకాలను అర్హులకు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ ఈ సందర్భంగ పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లపై స్పష్టత ఇచ్చిందన్నారు. జనవరి 26న ఈ పథకాలను అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ఆ దిశగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఐటీడీఏ పీవో కుష్బు గుప్త, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సివిఎస్ రాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్, తదితరులున్నారు.

● జాతీయ ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పించాలి

ఆదిలాబాద్ రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజన గ్రామాల్లో కళా సారథి కళాకారులచే నిర్వహించే అవగాహన కార్యక్రమాలను ఆదిలాబాద్ జడ్పీ సమావేశం మందిరం నుంచి ప్రత్యేక వాహనాన్ని జెండా ఊపి కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. జాతీయ ఆరోగ్య పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.

'ఆదివాసీ పర్ధాన్ అభివృద్ధికి పాటుపడాలి'

మావల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఆదివాసీ పర్ధాన్ సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆదివాసీ పర్ధాన్ పురోహిత్ సంఘ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉయికే సుదర్శన్, మెస్రం కేశవ్‌లు పిలుపునిచ్చారు. ఇటీవల ఆదివాసీ పర్ధాన్ పురోహిత్ సంఘ్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్న సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ జిల్లా కార్యవర్గంలో ఉన్న అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక సభ్యులు వారి వారి డివిజన్ పరిధిలోని పర్ధాన్ సంఘ్ మండల కమిటీలను ఈ నెల 28లోగా నియమించాలన్నారు.

రైతులపై చేయి వేస్తే ఊరుకునేది లేదు

● మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ● బేలలో పార్టీ ఆధ్వర్యంలో రైతుల రాస్తారోకో


బేలలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు


మాజీ మంత్రి జోగు రామన్నను అరెస్టు చేస్తున్న పోలీసులు

జైనథ్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు రుణమాఫీ గురించి అడిగితే పోలీసులు చేయి వేస్తే ఊరుకునేది లేదని రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం బేల మండల కేంద్రంలో రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఎర్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు పూర్తిగా రుణమాఫీ, రైతు భరోసా పథకం అమలు చేయక రైతులను అప్పుల పాలు చేస్తుందని రామన్న ఈ సందర్భంగా విమర్శించారు. అంతేకాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రైతులను పూర్తిగా మోసం చేసిందని ఆరోపించారు. ఈ సందర్భంగా బేల మండల పోలీసులు మాజీ మంత్రి జోగు రామన్నను అరెస్టు చేసి రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ, ఆదిలాబద్ మార్కెట్ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, బేల మండల మాజీ ఎంపీపీ గంభీర్ ఠాక్రె, నాయకులు సతీష్ పవార్, జక్కుల మధుకర్, దేవన్న, కిషన్‌దారా, జితేందర్, తన్వీర్ ఖాన్, మండల రైతులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


విజేత జట్టుకు బహుమతులను అందజేస్తున్న నాయకులు

హోరాహోరీగా సాగిన క్రికెట్ పోటీలు

సిరికొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దారుఢ్యం తో పాటు, మానసికొల్లాసాన్ని పొందవచ్చని సిరికొండ మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలో గత పది రోజులుగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహాయ సహకారాలతో గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. ఇందులో మొద టి బహుమతిని సిరికొండ జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ సోంపల్లి జట్టుకు రూ.10 వేలు, తృతీయ ఫకీర్ నాయక్‌తండా జట్టుకు రూ.5 వేలను అందజేశారు. కార్యక్రమంలో కదం సూర్యకాంత్, రోహిదాస్, తోకల చందు, లతీఫ్, జింక లక్ష్మణ్, యు వకులు, గుగ్గిళ్ల స్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ఆటలతో పాటు చదువు ముఖ్యమే'

బోథ్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుణ్యా నాయక్ తండాలో గత 15 రోజుల నుండి జరుగుతున్న క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీలలో గెలుపొందిన కెన్ వాట్ జట్టుకు మొదటి బహుమతిగా తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ నుండి మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ రూ.26 వేలు, రెండవ బహుమతిగా పుణ్యానాయక్ తండా జట్టు రూ.18 వేలు అందించారు. ఇందులో మాజీ సర్పంచులు పార్వతి బాయ్, సురేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు రోహిదాస్, రాయల్ ఈశ్వర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు భీం ఆర్మీ ఆహ్వాన పత్రిక

ఇంద్రవెల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 8, 9వ తేదీలలో మహారాష్ట్రలోని కిన్వట్ పట్టణ కేంద్రంలో జరిగే జాగతిక బౌద్ధ ధమ్మ పరిషద్ కార్యక్రమానికి రావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను వారి క్యాంపు కార్యాలయంలో భీం ఆర్మీ, దళిత సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు పరత్యాగ్ సందీప్, ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తం, దళిత సంఘాల నాయకులు సోన్ కాంబ్లే జితేందర్, పరత్యాగ్ దత్త, సూర్యవంశీ బాదల్, గాయక్వాడ్ బాబాసాహెబ్, తదితరులు ఉన్నారు.

'నిరుద్యోగ భృతి అమలు చేయాలి'

సిరికొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా, ఇచ్చిన హామీలు మాత్రం పక్కదారి పడుతున్నాయని, ఆరు గ్యారెటీలలో యువ వికాస్ పథకాన్ని నిరుపేద నిరుద్యోగ యువకుల కోసం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు డిమాండ్ చేశారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిరుద్యోగ యువతీ, యువకులు నిరుద్యోగ భృతి అమలు చేయాలంటూ ముగ్గులు వేసి పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ఇందులో పార్టీ నాయకులు, యువతీయువకులు పాల్గొన్నారు.

ముగ్గులు వేసి మహిళల నిరసన

బోథ్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోనాల గ్రామానికి చెందిన మహిళలు సంక్రాంతి రోజున ప్రభుత్వం ఇచ్చిన హామీల నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ముగ్గులు వేసి వారి నిరసనలు చాటుకున్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని, రూ.4వేల పెన్షన్, కల్యాణ లక్ష్మికి రూ.లక్ష, తులం బంగారం ఇస్తామని మర్చిపోయారని, అంతేగాక పూర్తి రుణమాఫీ చేయాలని గొబ్బెమ్మల చుట్టూ ముగ్గులు వేసి నిరసన తెలిపారు. ఇందులో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, తదితరులున్నారు.

'రైతు భరోసా'పై కసరత్తు

(5వ పేజీ తరువాయి...)

భావిస్తున్నట్లు తెలుస్తుంది. అంటే గత కొంతకాలంగా పంటలు పండించకపోయినా, భూములకు పెట్టుబడి సహాయం అందనుంది. ఎందుకంటే రైతుల పరిస్థితి బాగుంటే.. తిరిగి పంటలను పండించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం ఎలాంటి పంటలు లేకపోయినా.. సాగుకు అనుకూలమైన భూములన్నింటికీ పెట్టుబడి సహాయం అందనుంది. మొత్తానికి శాశ్వతంగా పంటల సాగుకు దూరమైన భూములకు మాత్రమే పెట్టుబడి సహాయాన్ని నిలిపి వేయనున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా ఖాన్ సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. బ్యాంకింగ్, ఏటీఎం, ఫోన్ బ్యాంకింగ్, కార్డ్ నంబర్‌ను ఎవరితో పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెం.1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకంతో రూ.5లక్షల హాంఫట్

● టీజీబీ బ్యాంకు ఎదుట బాధితురాలి నిరసన

ఆదిలాబాద్ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తనకు తెలియకుండానే ఎఫ్‌ఏ డబ్బులను బ్యాంకు అధికారులు ఇతర అకౌంట్లోకి మార్చరని జైనథ్ మండలానికి చెందిన తిప్పరెడ్డి రేఖ ఆరోపించారు. బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తన రూ.5 లక్షల ఫిక్స్ డిపాజిట్ డబ్బులను సమాచారం లేకుండా ఇతర అకౌంట్‌లోకి మార్చారని కంటతడి పెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం ఆగస్టులో రూ.5 లక్షల 13 వేల ఎఫ్‌ఏ చేశానని, అయితే 11 డిసెంబర్ 2024న ఎలాంటి సమాచారం లేకుండా తన ఎఫీని ఇతరఅకౌంట్‌లోకి మార్చారని ఆరోపించారు. తనకు ఈ విషయంలో న్యాయం కావాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై టీజీబీ ఆర్ఎం ప్రభుదాస్ మాట్లాడుతూ ఎఫ్‌ఏ డబ్బులు ఇతర అకౌంట్‌లోకి మారినట్టు సోమవారం ఫిర్యాదు వచ్చిందన్నారు. మంగళవారం సెలవు కారణంగా బుధవారం సంబంధిత బ్రాంచ్‌కు లేఖ రాశామని, దీనిపై విచారణ కొనసాగుతుందని తెలిపారు.

ఇరు వర్గాలపై కేసు : ఎస్సై

నేరడిగొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్టికల్ గ్రామంలో మంగళవారం రాత్రి పాత కక్షలు, ఆస్తి పంపకాల విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడగా పలువురికి స్వల్పగాయాలయ్యాయి, వెంటనే సంఘటనా స్థలానికి ఎస్సై శ్రీకాంత్ చెరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి ఇరు వర్గాల వారిని సముదాయించి శాంతిభద్రతలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుదవారం ఇరు వర్గాలవారు తిత్రే సునిత, బస్సి నానక్‌సింగ్‌ల ఫిర్యాదు మేరకు 23మందిపై కేసు నమోదు చేశామని అన్నారు. గతంలో సైతం గొడవలకు పాల్పడగా వారిపై కేసులు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు.

గన్‌పూర్‌లో ముగిసిన కబడ్డీ పోటీలు

బోథ్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని ఘన్పూర్ గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిసిపోయాయి. సంక్రాంతి సందర్భంగా జాగృతి గ్రామ అభివృద్ధి కమిటీ వారు ప్రత్యేక కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు మాజీ ఎంపీపీ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో క్రీడలను నిర్వహించడం వల్ల ప్రతిభ ఉన్నవారు బయటకు వస్తారన్నారు. ఆటలతో పాటు విద్యలో ముందుండాలని సూచించారు. లఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సురేందర్ యాదవ్, సక్కారం మాజీ ఎంపీటీసీలు రోహిదాస్ బోత్ పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, సంతోష్, ఈశ్వర్, తుల హరీష్, చిన్నయ్య, నరేందర్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో ముగిసిన కనుమ పండుగ


ఖానాపూర్‌లోని అయ్యప్ప ఆలయంలో వెలుగుతున్న మకరజ్యోతి


గాలిపటం ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


వాకిటి లోగిల్లలో రంగవల్లులు వేస్తున్న బాలికలు

వ్యవసాయ ప్రాధాన్యం కలిగిన నిర్మల్ జిల్లాలో కనుమ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఆవులు, ఎద్దులను కడిగి పూజలు చేసి నైవేద్యాలు పెట్టారు. ఉదయాన్ని ఆడపడుచులు పోటీ పడి వాకిళ్లలో రంగవల్లులు తీర్చిదిద్దారు. నోములు నోచుకున్నారు. బుధవారం ఉద్యాపన చేశారు. నూతన వస్త్రాలను ధరించి, పిండి వంటకాలను ఆరగిస్తూ ఆనందంగా గడిపారు. పిల్లలు మొదలు యువకుల వరకు గాలిపటాలు ఎగురవేశారు. జిల్లాలోని అయ్యప్ప స్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.కుభీర్ మండలం దోడర్న రాంనాయక్ తండాలో కుస్తీ పోటీలు జరిగాయి.

నిర్మల్ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్లు కాంగ్రెస్ పార్టీ నేత, భాగ్యనగర్ కాలనీ ఇన్‌చార్జి కడప శ్రీకాంత్ తెలిపారు. ఈ సంబరాల్లో పలువురు యువకులు గాలిపటాలను ఎగురవేస్తూ కేరింతలు చేశారు.

పండుగ సంబరాల్లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులు, సబ్బండ వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, సంక్రాంతి పండుగను ప్రజలంతా ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం వారి నివాసంలో గాలిపటం ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో..

ఖానాపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం సంక్రాంతి పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తెల్లవారు జామున వాకిళ్లను కల్లాపి చల్లి రంగురంగుల రంగవల్లులతో అలంకరించారు. ఇళ్ల ముందు వేసిన ముగ్గులలో ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలు, నవధాన్యాలు, పండి వంటలను ఉంచి సంక్రాంతి పర్వదినాన తమ ఇళ్లకు లక్ష్మీ కళ వచ్చేలా అలంకరించారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా నూతన వస్త్రాలను ధరించి పలువురు గాలిపటాలను ఎగురవేయడం కనిపించింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రాల్లోని అయ్యప్పస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం వేళ అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మకర జ్యోతి వెలిగించారు. అయ్యప్ప ఆలయం వద్ద మకర జ్యోతిని దర్శించుకునేందుకు పట్టణంలోని పలు భక్తులు తరలివచ్చారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పలుచోట్ల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలరించిన రంగవల్లులు

లక్ష్మణచాంద, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజలు భోగి, మకర, కనుమ పేరుతో బుధవారం వరకు మూడు రోజులపాటు సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. రంగు రంగుల రంగవల్లులతో వాకిటి లోగిల్లన్నీ రంగుల మయమయ్యాయి. ఈ పండగను పురస్కరించుకొని బాలికలు, యువతులు, మహిళలు వేసిన సాంప్రదాయం ఉట్టిపడే ముగ్గులు (రంగవల్లులు) పలువురిని ఆకట్టుకున్నాయి. విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఉపాధి కొరకు ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంత సొంత ఊరుకి రావటంతో పల్లెల్లో సందడిగా నెలకొంది. కుటుంబ సభ్యులంతా కలిసి స్థానిక ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

ముగ్గుల పోటీలు

నర్సాపూర్(జి), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అరవింద స్కూల్‌లో కేడీఆర్ యూత్ సభ్యులు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు వివిధ రంగులతో ముగ్గులను వేశారు. కేడీఆర్ అధ్యక్షులు దత్తాత్రేయ, యూత్ సభ్యులు ఉమా మహేశ్వర్, రమేష్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రవి, రాకేష్, లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాల్గొని ముగ్గులను పరిశీలించారు.

ముథోల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో చిన్న పెద్దలు కలిసి గాలిపటాలు ఎగురవేశారు. ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. మహిళలు రంగు రంగుల రంగవల్లులు వేశారు. అలాగే మహిళలు ఉపవాస దీక్ష బూని నోముల కార్యక్రమాన్ని చేట్టారు. ఈ సందర్భంగా ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సంప్రదాయ రీతిలో..

భైంసా, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డివిజన్ వాసులు మూడు రోజుల పాటు సంక్రాంతి పర్వదిన వేడుకలను సంప్రదాయ రీతిలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. సోమవారం భోగితో ప్రారంభమైన వేడుకలు బుధవారం కనుమతో ముగిసాయి. మంగళవారం సంక్రాంతి పురస్కరించుకొని మహిళలు నోముల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహించుకున్నారు.చిన్నారులకు బోగి పండ్లు పోసారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయాలకు వెళ్ళి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.పలు కాలనీల్లో మహిళలు సాముహిక సంక్రాంతి నోములను వైభవోపేతంగా నిర్వహించుకున్నారు.పర్వ దినవేడుకలో బాగంగా ప్రజలు పిండివంటలు చేసుకొని పరమాన్నాన్ని భుజించి ఇంటిల్లిపాదీ ఆత్మీయంగా జరుపుకున్నారు. అల్లుళ్ళు, కూతుళ్ళను ఇంటికి ఆహ్వానించి నూతన వస్త్రాలు పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ వేడుకలను సంప్రదాయ బద్దంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. యువతులు పోటాపోటీగా తమ తమ ఇంటి లోగిళ్ళ ముందుకు రంగురంగులతో ఒకరిని మించి మరొకరు ముగ్గులను వేసి తెలుగు సంస్కృతిని ప్రతిబింబచేశారు. మహిళలకు ఒకరికొకరు నోములను ఇచ్చిపుచ్చుకున్నారు.యువకులు పతాంగులను ఎగురవేసారు.

అలరించిన కుస్తీ పోటీలు

కుభీర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డొడర్న రాంనాయక్ తండాలో మంగళవారం సంక్రాంతి పండుగను పురష్కరించుకొని కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ కుస్తీ పోటీలకు మండలంలోని ఆయా గ్రామాలతో పాటు పొరుగు మహారష్ట్ర నుంచి మల్లయోదులు భారీగా తరలివచ్చి కుస్తీ పోటీల్లో తలబడ్డారు. మొదటి విజేతకు రూ. 7000 నగదు, రెండో విజేతకు రూ. 5వేలు, మూడవ విజేతకు రూ. 3వేలు అందజేశారు.


నోములు అందజేస్తున్న మహిళ


భైంసాలో చిన్నారికి బోగి పండ్లు పోస్తున్న కుటుంబీకులు


రాంనాయక్ తండాలో కుస్తీ పడుతున్న మల్లయోధులు

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో

ఆర్జీయూకేటీ విద్యార్థి ప్రతిభ


కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు

బాసర, జనవరి, 15 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీలో పీయూసీ రెండవ సంవత్సరం చదువుతున్న సంగారెడ్డి జిల్లాకు చెందిన మధులత నేషనల్ యూత్ ఫెస్టివల్ 2025లో ప్రతిభ చాటింది. నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) యువజన వ్యవహారాలు, క్రీడా, మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈనెల 10, 12 తేదీలలో ప్రధానమంత్రి మ్యూజియంలో జరిగిన కార్యక్రమంలో టెక్ ఫర్ విక్షిత్ భారత్‌పై పీపీటీని అందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొనే వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మధులతను అభినందించారు. చదువుతో పాటు సేవా, దేశ భక్తి తదితర రంగాల్లో రాణించడం గొప్ప పరిణామం అని తెలిపారు. మధులత మరింత మంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మధులత ప్రయాణం క్విజ్ పోటీతో ప్రారంభమై రచనా నైపుణ్యంతో తదుపరి దశలో ఆమెకు స్థానం సంపాదించిపెట్టింది. తర్వాత రాష్ట్ర స్థాయిలో టెక్ ఫర్ విక్షిత్ భారత్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించినది. మొదటి స్థానం సంపాదించిన అనంతరం 3 వేల మంది పాల్గొనే వారితో పోటీ పడి జాతీయ స్థాయికి చేరుకుంది. ఈ ప్రయాణంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించినందుకు ఎన్ఎస్ఎస్‌కి కృతజ్ఞతలు తెలిపింది.

వాలీబాల్ టౌర్నమెంట్ ప్రారంభం

కుభీర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్పెల్లి గ్రామంలో బుధవారం వాలిబాల్ టౌర్నమెంట్‌ను మాజీ సర్పంచ్ కొట్టే హన్మండ్లు ప్రారంభించారు. నాయకులు పబ్బు ధర్మపురి, బొందెల శ్రీనివాస్, పొట్టేవార్ కళ్యాణ్, ముప్పెనకర్ విగ్నేష్, పొట్టేవార్ చరణ్, ఇందూర్ సాయి, ఆలూర్ దత్తు, గంధం చింటు, అవనూర్ నర్సయ్య యువకులు, వాలిబాల్ అభిమానులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

నర్సాపూర్(జి), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2002-2003 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. పాఠశాలలో సిల్వర్ జూబ్లీ పేరిట అపూర్వ సమ్మేళనం నిర్వహించారు.

క్రీడల వల్ల మానసిక ఉల్లాసం

లోకేశ్వరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడల వల్ల యూత్‌లో మానసిక ఉల్లాసం కలుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని దుబ్బాగ్రౌండ్‌లో గత ఐదు రోజులుగా కేతడి శేఖర్‌రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను తన కుమారుడు కేతడి కృష్ణారెడ్డి తన సొంత ఖర్చులతో ఎలెకేపీ పేరుతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇలాంటి క్రీడలు నిర్వహించడం వల్ల వారిలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో 10 టీములు పాల్గొనగా మంగళవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఇందులో మొదటి బహుమతిగా ఆదర్శ యూత్ విజేతగా నిలువగా వారికి 15,000 రూపాయలతో పాటు సీల్డ్, ద్వితీయ బహుమతిగాసూపర్ స్ట్రైకర్స్ యూత్ రన్నర్‌గా నిలిచింది. వీరికి 10,000 రూపాయలతో పాటు సీల్డ్ అందజేయనున్నారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎల్. చిన్నారావు, యువ నాయకులు కపిల్, విజయ్‌రావు, మండల కాంగ్రెస్ కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రసూల్ యాదవ్, దౌనెల్లి సపీన్, వీడీసీ చైర్మన్ సురేష్, మంగలి భోజన్న, కొత్తూరు భోజారాం, రిటైర్డ్ ఆర్మీ కుమ్మరి శంకర్, గ్రామస్తులు, ఆయా యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అంతా ఆకు కూరలే!



మెంతికూర, పుదీన కట్టలు

- బైంసా డివిజన్ పరిధిలో పెరిగిన దిగుబడులు
- తగ్గిన ధరలు
- వాణిజ్య పంటలతో నష్టపోయిన రైతులు
- ప్రత్యామ్నాయం వైపు దృష్టి



మార్కెట్‌లోకి తెచ్చిన ఆకు కూరలు

భైంసా, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యేటా వాణిజ్యపంటల సాగుతో కష్ట, నష్టాల పాలవుతున్న భైంసా డివిజన్ పరిధిలోని రైతాంగం ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారించింది. ఇందులో భాగంగానే స్వల్ప వ్యవధిలో తక్కువపెట్టుబడితో ఆశించిన మేర లాభాలను గడించేందుకు గాను ఆకుకూరల సాగువైపు దృష్టి సారించింది. ప్రధానంగా సాగునీటి వ్యవస్థ గల ఇక్కడి ప్రాంత రైతాంగం కూరగాయల సాగువైపు దృష్టి సారించింది. ప్రస్తుత రబీసీజన్‌లో కూరలలో భాగంగా ఆకుకూరల సాగును అధికంగా చేపడుతున్నారు. ఇందులో పాలకూర, మెంతికూర, కొత్తిమీర, పుదీనా పంటల సాగుబడిపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఈ క్రమంలో సంబంధిత పంటల సాగువిస్తీర్ణం పెరిగింది. ఇది వరకు భైం సా డివిజన్ పరిధిలో 750 హెక్టార్ల వరకు ఉన్న ఆకుకూరల సాగు ప్రస్తుతం 1400 హెక్టార్ల వరకు పెరిగింది. ప్రస్తుతం డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సాగులోనున్న పాల, మెంతికూర దిగుబడులు విక్రయానికి సిద్ధమయ్యాయి. రైతాంగం వాటిని విక్రయించేందుకుగాను భైంసా మార్కెట్‌కు తరలిస్తున్నారు. అన్ని ప్రాంతాల రైతులు విక్రయం కోసం తీసుకువస్తుండడంతో ఆకుకూరలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. భైంసా పట్టణంలో రోజూ విక్రయాలు జరిగే హోల్‌సేల్ మార్కెట్‌తో డివిజన్ వ్యాప్తంగా జరిగే వారాంతపు సంతల్లో సైతం ఆకుకూరలు ముంచెత్తుతున్నాయి. డిమాండ్‌ను మించి ఆకుకూరలు మార్కెట్‌కు వస్తుండడంతో ధరలు తగ్గాయి. ఇది వరకు పాలకూర కట్ట రూ.10లకు ఒకటి లభ్యమవగా ప్రస్తుతం ఇదే ధరకు రెండు నుంచి మూడుకట్టలు లభ్యమవుతున్నాయి. ఇక రూ.15కి కట్ట చొప్పున లభ్యమయ్యే మెంతికూర కట్టలు ప్రస్తుతం ఇదే ధరకు రెండు నుంచి మూడు చొప్పున లభ్యమవుతున్నాయి. ఆరోగ్యపరంగా ఎంతో ప్రయోజనకరమైన ఆకు కూరలు తక్కువ ధరకు లభిస్తుండటంతో వినియోగదారులు ఆకుకూరలను కొనుగోలు చేస్తున్నారు.

మారుమూల పల్లెనుంచి ఉన్నతస్థాయి ఉద్యోగాలు





బీఎస్ఎఫ్ ఉద్యోగం సాధించిన మీనాక్షి



బీఎస్ఎఫ్ ఉద్యోగం సాధించిన సరస్వతి

- రాంనగర్ గ్రామంలో పదుల సంఖ్యలో పోలీసు కొలువులు
- రోడ్డు సౌకర్యమూ కరువు
- ఆదర్శంగా నిలుస్తున్న యవత

భోథ్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాంగ్వి గ్రామపంచాయతీ పరిధిలోని మారుమూలన ఉన్న గ్రామం రామ్‌నగర్. గత రెండు దశాబ్దాల క్రితం వెలిసిన ఈ గ్రామానికి దశాబ్దకాలం పాటు రోడ్డు లేదు. కాలినడకన రాకపోకలు సాగేవి. గ్రామ జనాభా ప్రస్తుతం 252 మంది ఉండగా 65 కుటుంబాలు జీవిస్తున్నాయి.

● చిన్న, సన్న కారు రైతులే

రాంనగర్ గ్రామం మొత్తం చిన్న సన్న కారు రైతులే. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉదయం 7 గంటలకి రైతులు పొలం పనుల్లో నిమగ్నమవుతారు. రాత్రి 7 గంటలకు ఇంటికి చేరుకుంటారు. అయితే వ్యవసాయంపై శ్రద్ధ చూపే ఈ రైతులకు వారి వారి కుటుంబాల్లో మహిళలు చేదోడు వాదోడుగా ఉండి వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతుంటారు. వివిధ రకాల పంటలు సాగుచేసి ఆర్థిక అభివృద్ధికి బాటలు వేసుకుంటున్నారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగుచేసి రైతులు ఆర్థిక అభివృద్ధికి అడుగులు వేసుకుంటున్నారు. వ్యవసాయం చేస్తూనే తమ పిల్లలను చదివించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. తాము కష్టపడి వ్యవసాయం చేసుకుంటున్న తమ పిల్లలు మాత్రం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్న తపనతో రైతులు పిల్లలను ఉన్నత చదువుల వైపు దృష్టి సారిస్తున్నారు. గ్రామంలో 11 మంది నేవీ, బీఎస్ఎఫ్, సివిల్ సీఆర్‌పీఎఫ్ ఇతర పోలీసు కొలువుల్లో విధులు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రభుత్వ రంగంలో సైతం ఉద్యోగాలు సాధిస్తున్నారు. వారి వారి బంధువులు వివిధ రకాల ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడడంతో వారిని చూసిన ఈ గ్రామ రైతులు తమ పిల్లలను చదువులో ప్రోత్సహిస్తున్నారు.

● గ్రామంలోని ఉద్యోగులు మా పిల్లలకు ఆదర్శం



మా గ్రామంలో యువకులు లక్ష్యంతో చదివి ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. వారే ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు ఆదర్శ. మేం కష్టపడతాం కానీ మీరు మాత్రం ఉన్నతులుగా ఎదగాలంటూ ప్రతి తల్లిదండ్రి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. గ్రామానికి సరైన రోడ్డువసతి లేదు. రోడ్డు వసతి ఉంటే మా గ్రామం పిల్లలు చదువుల్లో మరింత రాణిస్తారు.

● జగదీష్, గ్రామ రైతు

బరంపూర్ కొండపై
ఘనంగా గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణం



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు



శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న కమిటీ

తలమడుగు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్‌గుట్టపై స్వయంభుగా వెలిసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి రంగనాథ స్వామీల కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చరనల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కల్యాణంలో వధువు తరఫున ఆలయ కమిటీ అధ్యక్షులు కేదారేశ్వర్ రెడ్డి సతీమణి స్వర్ణ, వరుని తరఫున మెరుగు మోహన్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలతోపాటు జిల్లా నలుమూలల నుంయి వెంకటేశ్వర స్వామి భక్తులు హాజరై కల్యాణాన్ని కన్నులపండుగగా తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు కేదారేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నూతన ఆలయం నిర్మించుకున్న నాటి నుంచి వైకుంఠ ఏకాదశి తర్వాత ఆలయంలో ప్రతి ఏడు శ్రీ గోదాదేవి రంగనాథ స్వామీల కల్యాణాన్ని వేద పండితులతో వైభవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే వచ్చే భక్తు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షులు తెలిపారు. కార్యక్రమంలో వేద పండితులు తిరునాగిరి స్వస్తిక్, ఆలయ కమిటీ సభ్యులు నాగిరెడ్డి, సామాజిక కార్యకర్త బండారు దేవన్న, రాజేందర్, మాజీ జడ్పీటీసీ బాబన్న, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి స్వరూపుడు.. హరిహరసుతుడు అయ్యప్ప



అయ్యప్పస్వామి



ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తున్న భక్తులు

ఇచ్చోడ, జనవరి, 15(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో మంగళవారం జ్యోతిదర్శన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ గౌరవ అధ్యక్షుడు ఎనుగు కృష్ణారెడ్డి ఆధ్వ ర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కన్నెమూల మహా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నాగరాజ స్వామి, మాలికపురొత్తమ మంజుదేవి మాత విగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్పస్వామికి పాలు, పెరుగు, నెయ్యి, తేనే, చక్కెర, పన్నీరు, పంచామృతం, పూలతో మహా అభిషేకం నిర్వహించారు. హరిహరసుతుడైన అయ్యప్పస్వామికి అంగరంగ వైభవంగా అలంకరించి జ్యోతిదర్శన సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన కనిపించే మకరజ్యోతి దర్శనానికి వచ్చే భక్తులకు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా సాక్షాత్తు శబరిమల అయ్యప్ప క్షేత్ర పరిసరాల్లో కనిపించే మకరజ్యోతిని చూసేందుకు భక్తులు సాయంత్రం పెద్దఎత్తున ఆలయానికి చేరుకున్నారు. మాలధారులు, అయ్యప్పభక్తులు ఇచ్చోడ ధర్మశాస్త్ర ఆలయంలో ఏర్పాటు చేసిన మకరజ్యోతి దర్శనాన్ని దర్శించి ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. మకరజ్యోతి దర్శన అనంతరం స్వామి వారు నిద్రపోయేముందు అయ్యప్పకు జోలపాట వంటి శ్లోకం హరివరాసనా స్తోత్రాన్ని కొండ హరిప్రసాద్ గురుస్వామి పఠించి సంప్రదాయబద్దంగా అయ్యప్ప ఉత్సవాలను నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటుచేసిన అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు చెన్నాల మల్లేశ్వర్‌రెడ్డి, సువర్ణ మహాదేవ్, నిమ్మల హన్మంత్‌రెడ్డి, వెన్నెల క్రిష్ణ, సురేం దర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మాలధారులు, భక్తులు, మాతస్వాములు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకల్లో ఎమ్మెల్యే



పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ జనవరి 15; సంక్రాంతి పండుగను మండలంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి పండుగ సంబరాలను జరుపుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తన స్వగ్రామమైన రాజురలో గల జగదాంబదేవీ అలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



కనుమ పండుగ సందర్భంగా మట్టితో చేసిన ఎడ్లను పూజిస్తున్న గ్రామస్తులు

గిరిజన గ్రామాల్లో ఘనంగా కనుమ పండుగ

బోథ్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుర్దాపూర్ గ్రామంలో బుధవారం గిరిజనులు కన్నుల పండుగ వేడుకలను జరుపుకున్నారు. పవిత్రమైన మట్టిని తీసుకువచ్చి గుడి గోపురాన్ని తయారు చేసి మట్టితో ఎడ్లను తయారు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. రైతులు వివిధ పద్ధతుల్లో పండుగను జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. ఆ అనవాయితీ ప్రకారం గిరిజన గ్రామాల్లో పండుగను జరుపుకున్నారు. గిరిజన సాంప్రదాయం ప్రకారం పండుగను గిరిజనులు గ్రామాల్లో జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మడవిలాలుదేవ్, పంద్రం శంకర్, వార్డెన్ శ్రీనివాస్, శీడం లక్ష్మణ్, పరశురాం జైతులు తదితరులు పాల్గొన్నారు.

పండుగ వేళ ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



ఉట్నూర్‌లో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు బాలికలు



రామ మందిరం ముగ్గు దృశ్యం



ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

నిర్మల్ కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్‌లోని హనుమాన్ మందిరం ఆవరణలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని, మహిళలు ఉత్సాహంగా పెద్దఎత్తున ముగ్గుల పోటీల్లో పాల్గొన్నందుకు వారిని అభినందించారు. అనంతరం ముగ్గులను పరిశీలించారు. ఈ ముగ్గుల పోటీల్లో అయోధ్య రామ మందిరం ముగ్గు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి బహుమతులు ప్రధానం చేసి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలుగుల చిన్నయ్య, నర్సింగ్ రావు, బొట్టు నగేష్, సాయిబాబా, సాయినాథ్, సురేష్, రాజు, సుదర్శన్, భాస్కర్, భోజన్న, తదితరులున్నారు.

తాంసి : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని తాంసి మండల కేంద్రంలోని రామేశ్వర ఆలయంలో రెండురోజుల నుంచి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గ్రామానికి చెందిన 165 మంది మహిళలు ముగ్గులు వేశారు. రంగురంగుల ముగ్గులతో ఆలయ ప్రాంగణమంతా కనువిందు చేసింది. గతంలో కంటే ఈ సంవత్సరం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన మహిళలకు తాజా మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్ బహుమతులను అం దజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామపెద్దలు మాట్లాడుతూ మహిళల్లో దాగి ఉన్న నైపుణ్యతను ఈ పోటీల వల్ల బయటకు తీయవచ్చున్నారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ మహేందర్ రెడ్డి. పలువురు నాయ కులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం ఉట్నూర్ మండలకేంద్రంలోని వినాయకచౌక్ సార్వజనిక్ హనుమాన్ మందిర్ ప్రాంగణంలో మహిళలకు నిర్వహించిన ముగ్గులపోటీలు అలరించాయి. ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడం జరిగిందని విశ్వహిందూ పరిషత్ ఉత్సవ కమిటీ సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గుండికోట మొగిలి మాట్లాడుతూ హిందువుల పండుగలు సంప్రదాయమైనవన్నారు. ఈ పండుగలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కొండేరి రమేష్, రామిని నాగన్న, డాక్టర్ సాడిగే రాజగోపాల్, గడ్డం ప్రకాష్, షికారి శ్రీనివాస్, బింగి వెంకటేష్, ఉస్కే మల్ల దేవదాస్, జాదవ్ సుమన్ బాయి, రాణి పాల్గొన్నాయి.

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఆ పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రికి పార్టీ నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి మాజీ మంత్రి ఉత్సాహంగా పతంగులు ఎగుర వేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు సంతోషాలతో పండుగ జరుపుకొనే వారని నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితి లేదన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మాజీ మంత్రి జోగురామన్న ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ మేరకు పలువురు మహిళలు, యువతులు వేసిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి. న్యాయ నిర్ణేతలు ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు నగదు బహుమతి అందజేశారు. మొదటి బహుమతి రూ.11 వేలు, రెండవ బహుమతి రూ.6 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు అందజేశారు.



గెలుపొందిన మహిళలకు బహుమతుల ప్రధానం చేస్తున్న వక్తలు

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

తలమడుగు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కౌలు రైతులకు సహాయం, రేషన్ కార్డుల పంపిణీ, తదితర పథకాల ఎంపికలో ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభల ద్వారా స్థానిక అధికారులు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు.



ఉట్నూర్ నుంచి నాగోబా గూడకు పాదయాత్రగా తరలి వెళ్తున్న మెస్రం గిరిజనులు

పవిత్ర జలాల కోసం పాదయాత్ర

ఉట్నూర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంస్కృతీ, సంప్రదాయాలతో మెస్రం గిరిజనుల నాగోబా దేవతకు మహా పూజ నిర్వహించడానికి పవిత్ర గంగాజలాల సేకరణ కోసం పాదయాత్ర ప్రారంభించిన మెస్రం గిరిజనులు మూడు రోజులుగా ఉట్నూర్ మండలంలో పాదయాత్ర కొనసాగిస్తున్నారు. తమ సంస్కృతీ, సంప్రదాయాలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఆదివాసీ గిరిజనులు భావితరాలకు అందించేలా కొనసాగిస్తున్నారు. ఈనెల 10న కెస్లాపూర్ నుంచి నాగోబా మహా జాతర ప్రారంభం కోసం కావాల్సిన గంగాజలం కోసం మెస్రం గిరిజనులు పాదయాత్ర ప్రారంభించారు. నాగోబా అభిషేకం కోసం కావాల్సిన పవిత్ర గంగాజలం సేకరణ కోసం తెల్లని దుస్తులు ధరించి పాదయాత్ర ప్రారంభించిన మెస్రం గిరిజనులు ఆదివారం నుంచి సాలెవాడ, దర్మ గూడల మీదుగా మంగళవారం ఉట్నూర్‌కు చేరుకున్నారు. ఉట్నూర్ మండలకేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉట్నూర్‌కు చెందిన గిజనులు బస ఏర్పాటు చేశారు. పవిత్ర గంగాజలం కలశానికి స్థానిక గిరిజనులు సైతం పూజలు చేశారు. మంగళవారం ఉట్నూర్ నుంచి పాదయాత్రగా బయలుదేరిన మెస్రం గిరిజనులు నాగోబా గూడకు చేరుకున్నారు. నాగోబా గూడలో అక్కడ గిరిజనులు కలశానికి పూజలు చేశారు. మధ్యాహ్నం భోజనం అనంతరం అక్కడి నుంచి పాదయాత్ర ప్రారంభించిన మెస్రం గిరిజనులు నిర్మల్ జిల్లాలోని ఉడుంపూర్‌కు బుధవారం చేరుకొని బస చేస్తారు. 16న మల్లాపూర్‌కు, 17న జన్నారం మండలం కలమడుగు వద్ద ఉన్న గోదావరి రేవుకు చేరుకొని హస్తినమడుగులో స్నానాలు చేసిన అనంతరం పవిత్ర జలాలు సేకరించిన అనంతరం అక్కడి నుంచి తిరుగు ప్రయాణం పాదయాత్ర ద్వారా ప్రారభిస్తామని మెస్రం కోసేరావు, బాధిరావు తెలిపారు.

- జిల్లాలో మొత్తం లక్షా 62 వేల పట్టాదారు పాసు పుస్తకాలు
- నేటి నుంచి క్షేత్రస్థాయిలో సాగుకు యోగ్యం కాని భూముల సర్వే
- ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు
- ఇక గుట్టలు, వెంచర్లు, మైనింగ్ భూములకు రైతు భరోసా బంద్
- జనవరి 26 నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ

● భూమిని చదును చేస్తున్న రైతు(ఫైల్)



'రైతు భరోసా'పై.. కసరత్తు

ఆదిలాబాద్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రైతుబంధు పథకంపై ఎన్నో విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. గతంలో ఎకరాన వానాకాలం యాసంగి పంటలకు గానూ రూ.10వేల నగదును పెట్టుబడి సహాయంగా అందించారు. ప్రభుత్వం ఎకరాన రూ.6 వేల చొప్పున.. రెండు పంటలకు రూ.12 వేలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతుబంధు పథకాన్నే రైతు భరోసా పథకంగా పేరు మార్చి అమలు చేయనున్నారు. ముఖ్యంగా సాగుకు యోగ్యం కానీ భూములకు కూడా పెట్టుబడి సహాయాన్ని అందించడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో క్షేత్రస్థాయిలో సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తించేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. బుధవారం ఈ పథకం విధివిధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగానే జనవరి 16 నుంచి 20 వరకు గ్రామాల్లో ప్రత్యేక అధికార బృందాలు సర్వేను చేపట్టనున్నాయి. జిల్లాలో లక్షా 62 వేల పట్టాదారు పాసుపుస్తకాల డేటా ఆధారంగానే గ్రామాల్లో ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి ప్రభుత్వానికి పూర్తి వివరాలతో కూడిన నివేదికను అందించనున్నారు. అయితే అనుకున్న విధంగా అన్ని పూర్తయితే జనవరి 26 నుంచి రైతుభరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో పెట్టుబడి సహాయం డబ్బులను జమచేయనున్నారు.

రూ.15 వేలు కాదు.. రూ.12 వేలే

రైతుబరోసా పథకం కింద ఎకరాన రూ.15 వేలను అందిస్తామని మొదట చెప్పినా.. ప్రస్తుతం రూ.12 వేలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తుంది. దీనిపై రైతుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే రెండు సీజన్‌లకు ప్రభుత్వం పెట్టుబడి సహాయాన్ని అందించలేదని రైతులు చెబుతున్నారు. దీంతో పెట్టుబడి సహాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏడాది తర్వాత కేవలం రూ.వెయ్యి పెంచి పెట్టుబడి సహాయాన్ని అందించాలని ప్రభుత్వం ప్రకటించడంపై విమర్శలు వస్తున్నాయి. అయితే ఈనెల 20వరకు సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తించి ఫీల్డ్ వెరిఫికేషన్ చేయనున్నారు. భూభారతి ఫోర్టల్ నుంచి వివరాలను సేకరించి గూగుల్ మ్యాప్, గ్రామ మ్యాప్‌లతో సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తిస్తారు. గ్రామాల్లో ఈ ప్రక్రియ వేగంగానే జరగనున్న మండల కేంద్రాలు, పట్టణ శివారు ప్రాంతాల్లోనే కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

102 క్లస్టర్లలో సర్వే

జిల్లాలో 102 క్లస్టర్లలో రైతుభరోసాపై ఫీల్డ్ వెరిఫికేషన్ సర్వేను నిర్వహించనున్నారు. ఒక్కో క్లస్టర్‌కు ప్రత్యేక అధికారుల బృందాన్ని నియమించారు. మొత్తం జిల్లావ్యాప్తంగా 102 అధికార బృందాలు సర్వేలో పాల్గొన్నాయి. ఇందులో వ్యవసాయశాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొంటారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులతో పాటు ఏఈోలు, రెవెన్యూ అధికారుల బృందం సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తించనున్నారు. ఈనెల 20వరకు క్షేత్రస్థాయిలో ఫీల్డ్ సర్వేను చేపట్టి 21నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహిస్తారు. ఇందులో సాగుకు యోగ్యం కానీ భూముల వివరాలను వెల్లడిస్తారు. గ్రామప్రజలతో చర్చించి జాబితాను ఆమోదం తెలుపుతారు. దానిని ఎప్పటికప్పుడు గ్రామసభ పర్తి కాగానే ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తారు. ఈనెల 25 వరకు వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.


గడువులోగా ఫీల్డ్ వెరిఫికేషన్ సర్వేను పూర్తి చేస్తాం
: డి.శ్రీధర్ స్వామి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఆదిలాబాద్

రైతుభరోసా పథకం అమలుపై చేపట్టాల్సిన ఫీల్డ్ సర్వే విధివిధానాలు అందాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో అధికారులు సర్వేను నిర్వహిస్తారు. మఖ్యంగా సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తించి వివరాలను సేకరిస్తాం. గ్రామసభలు నిర్వహించి గ్రామస్థుల ఆమోదం మేరకే జాబితాను ప్రభుత్వానికి పంపిస్తాం. ఈనెల 25 వరకు ఫీల్డ్ సర్వే గ్రామసభలు, ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అనుకున్న గడువులోగానే పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందిస్తాం.

అడ్డగోలు సహాయానికి చెక్

ఇన్నాళ్లు రైతుబంధు పథకం కింద అడ్డగోలుగా అందించిన పెట్టుబడి సహాయానికి ఇక ప్రభుత్వం చెక్ పెట్టనుంది. సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తించి రైతుభరోసా పథకం నుంచి తొలగించనున్నారు. దీంతో వెంచర్ భూములు, గుట్టలు, రాళ్లరప్పలు మైనింగ్ భూములకు పెట్టుబడి సహాయం అందే అవకాశం ఉండదు. సాగుకు యోగ్యమైన భూముల్లో పంటలు వేసినా, వేయకపోయినా రైతుభరోసా కింద పెట్టుబడి సహాయం అందించాలని ప్రభుత్వం

తరువాయి 6వ పేజీలో...





పెన్‌గంగా వద్ద రామనంద యాదవ్‌రావ్ సమాధులు

నేటి నుంచి పెన్‌గంగా మహా జాతర ప్రారంభం

జైనథ్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులోని డొల్లర పిప్పల్‌కోటి వద్ద పెన్‌గంగా నదిలో గురువారం మహా జాతరకు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఈ జాతరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి వేలాది మంది మహిళలు భక్తులు, ప్రజలు హాజరై తమ మొక్కులను తీర్చుకుంటారు. ఈ సందర్భంగా పెన్‌గంగా నదిలో స్నానం ఆచరించి ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాని నైవేద్యం సమర్పించి వేడుకుంటారు. పెన్‌గంగా నది ఒడ్డున గల రామనంద తీర్థ యాదవ్‌రావ్ మహరాజ్ గురు శిష్యుల సమాధులను రంగురంగులతో అలంకరించారు. ఈ జాతర పక్షం రోజుల పాటు కొనసాగనుంది. గురువారం మహారాష్ట్రలోని పాటన్‌బోరి నుంచి పెన్‌గంగా నది వరకు వివిధ దేవతా మూర్తులతో కూడిన రథం రానున్నది. జాతరకు పిప్పల్‌కోటి గ్రామస్థులు పూర్తి ఏర్పాట్లను చేశారు.



సబ్‌స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న రైతులు

'రబీ పంటల సాగుకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి'

తలమడుగు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పర్‌దేవి, ఉమ్రి, కోసాయి, దేగామా, తదితర గ్రామాలకు చెందిన రైతులకు రబీ పంటల సాగుకు వెంటనే విద్య సౌకర్యం కల్పించాలని బుధవారం ఆదివాసీ గిరిజన గ్రామాలకు చెందిన రైతులు మండలకేంద్రంలోని సబ్ స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారి పంటల సాగుకు విద్యుత్ అందడం లేదని వాపోయారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరింత ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

'వృత్తి రక్షణ కోసం ఉద్యమిద్దాం'

నేరడిగొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): వృత్తి రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలో మోకు దెబ్బ బోథ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గౌడజన హక్కుల పోరాట సమితి 2025 క్యాలెండర్‌ను అమరవేణి నర్సాగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్య క్రమంలో ఆయన మాట్లాడారు.

నార్నూర్‌లో ఘనంగా ఖాందేవుడి జాతర

● తొడసం వంశీయుల ఆరాధ్య దైవానికి ప్రత్యేక పూజలు ● రెండో రోజున రెండున్నర కిలోల నువ్వుల నూనె తాగి.. మొక్కులు చెల్లించుకున్న ఆడబిడ్డ నాగుబాయి చందు ● హాజరైన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మహారాష్ట్ర ఎమ్మెల్యే తొడసం రాజులు



నువ్వుల నూనె తాగుతున్న ఆదివాసీ మహిళ



హాజరైన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మహారాష్ట్ర ఎమ్మెల్యే తొడసం రాజు

నార్నూర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తొడసం వంశస్తుల ఆరాధ్య దైవమైన ఖాందేవుడి జాతర ప్రతియేటా జనవరిలో సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రారంభమవుతుంది. ఈ జాతర ప్రారంభం కంటే ముందు పుష్య మాసంలో భాగంగానే దశాబ్దాల నుంచి ఆచారంగా వస్తున్న సంప్రదాయాన్ని మాన్కపూర్ గ్రామానికి చెందిన తొడసం మాసే మాల్ దేవతకు ప్రత్యేక పూజలు చేస్తారు. అదే రాత్రి అక్కడ ధర్మగూడలో బస చేసి మరుసటి రోజు నార్నూర్‌కు వచ్చి ఖందేవుడికి పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తొడసం వంశానికి చెందిన ఆడబిడ్డ నాగుబాయి చందు (కడోడ కిత్తక చెందిన) తొడసం వంశంలోని ఇళ్ల నుంచి సేకరించిన రెండున్నర కిలో నువ్వుల నూనె తాగి తమ మొక్కును తీర్చుకుంది. అయితే ఈమె మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా జీవితి తాలూకా కోద్దాపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ. దీని వల్ల కుటుంబంలో శాంతి, ఆరోగ్య పరంగా అందరూ బాగుంటారని దేవుడి మీద తొడసం వంశీయుల అపార నమ్మకం. కాగా ఈ ఖాందేవుడి మహా పూజా కార్యక్రమానికి విచ్చేసిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మహారాష్ట్ర ఎమ్మెల్యే తొడసం రాజులకు తొడసం వంశీయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఖాందేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. తొడసం వంశస్తులు సంప్రదాయంగా మొక్కులు చెల్లించిన అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తొడసం వంశయులు ఒక దగ్గరకు చేరుకుని సంప్రదాయ భేటీ నిర్వహించారు. ఆలయ అభివృద్ధితో పాటు సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆలయ ఆవరణలో మినీ ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యలను వివరించారు. ఇట్టి జాతరకు మహారాష్ట్ర, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తదితర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో జనాలు వచ్చి ఖాందేవుడికి మొక్కులు చెల్లించుకుంటారు.

● మహారాష్ట్ర ఎమ్మెల్యేకి ఆత్మీయ సన్మానం

నార్నూర్: మండలకేంద్రంలో మంగళవారం ప్రారంభమైన ఖాందేవుడి జాతర పూజ కోసం వచ్చినా మహారాష్ట్ర అర్ని కేళాపూర్ ఎమ్మెల్యే తొడసం రాజులకు స్థానిక మాజీ సర్పంచ్ నాయక్ బి.గజానంద్ నాయక్ ఆత్మీయ సన్మానం చేశారు. అనంతరం ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని వారిని కోరారు. ఆ తర్వాత ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆదివాసీల ఆరాధ్య దైవమైన ఖాందేవడి జాతర పూజకు రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అలాగే ఖాందేవుడికి మహా జాతర అభివృద్ధికి తమవంతు ఎల్లప్పుడు సహకార ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరావు లోకండే, మాజీ ఎంపీటీసీలు శివాజీ ఆడె, పరమేశ్వర్ కొలెట్కర్, మోడల్ స్కూల్ మాజీ చైర్మన్ సుభాష్ రాథోడ్, కోరల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

మహిళల అభివృద్ధికి నిరంతర కృషి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 26మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ అమృతలాల్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

● పీజీ హెచ్‌ఎంల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఉట్నూర్: తెలంగాణ రాష్ట్ర జై జైడ్ హెడ్ మాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీజీ హెచ్‌ఎం సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ సింగ్ తిలావత్, కోశాధికారి భరత్ చౌహన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి భరత్ చౌహన్, మండల విద్యాశాఖ అధికారులు మను కుమార్, ఆశన్న, రాథోడ్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

● ప్రతీ పేదవాడికి సంక్షేమ పథకాలు

సిరికొండ: రాష్ట్రంలోని ప్రతీ పేదవాడికి సకల సౌకర్యాలు సమకూర్చేందుకే ప్రజా ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన 16మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపడుచులకు వరమని అన్నారు. ఈ పథకం వల్ల పేదలకు ఆర్థికంగా ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతీష్ఠాత్మకంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఫణిందర్, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ తుకారాం, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : కేసర్ సింగ్

జైనథ్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సమాజంలోని వివిధ వాహనదారులు విధిగా ట్రాఫిక్‌నిబంధనలను పాటించాలని నేషనల్ హైవే పీఆర్‌వో కేసర్ సింగ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం డొల్లర గ్రామంలో వివిధ వాహనదారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ మద్యం సేవించి వాహనాలను నడపరాదని ఆయన పేర్కొన్నారు. జీబ్రా క్రాసింగ్ గుర్తులను పాటించాలని సూచించారు. అతి వేగంలో వాహనాలను నడుపొద్దన్నారు. పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈపీఎల్ సిబ్బంది ఎస్.శంకర్, ఎస్.చంద్రపతి, డీఐఆర్ నర్సింహ, వాహనదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



డొల్లర అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీఆర్‌వో కేసర్ సింగ్



కిడ్నీ బాధితుణ్ణి పరామర్శిస్తున్న ఆడె గజేందర్

కిడ్నీ బాధిత కుటుంబాలకు ఆడె పరామర్శ

నేరడిగొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్పల గ్రామంలో మంగళవారం గల కిడ్నీ బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇకన్‌చార్జి ఆడె గజేందర్ పరామర్శించారు, కిడ్నీ వ్యాధి రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఫ్లోరైట్ సమస్య ఉందని గ్రామస్థులు తెలుపగా.. త్వరలోనే గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయిస్తామని అన్నారు. అలాగే కిడ్నీ బాధితులు డయాలసిస్ చేసుకునే వారికి ఆదిలాబాద్ రిమ్స్‌లో ఉచితంగా అందేలా అధికారులతో మాట్లాడారు. అనంతరం హైమాస్ లైట్‌తో పాటు సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆడె వసంత్‌రావు, బోథ్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ప్రపుల్ చందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్, నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, హీరాసింగ్, శంకర్, సద్దాం, వకీల్, కపిల్‌దేవ్, మురళీగౌడ్, జితేందర్, తదితరులు ఉన్నారు.

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
ఆదిలాబాద్ - 93983 85917
ఇచ్చోడ - 85000 38312
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్: 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451